రైతులను మోసగిస్తే మిల్లర్ల లైసెన్స్‌లు రద్దు

- ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తి లేదు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరిక
- తాగునీటి కోసం కర్ణాటక సర్కార్‌తో సంప్రదింపులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ధాన్యం కొనుగోళ్లలో రైతులను మోసం చేసే మిల్లర్లు, ట్రేడర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తాం. కుంటి సాకులు చెప్పి అవకతవకలకు పాల్పడే మిల్లులకు కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) నిలిపి వేయడంతో పాటు వాటిని బ్లాక్ లిస్టులో పెడుతాం. ప్రభుత్వ మార్గదర్శకాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు, తాగునీటి సరఫరాపై మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు.

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో అక్రమాలకు తావు లేకుండా సంబంధిత విభాగాల అధికారులు జిల్లాలకు వెళ్లి క్షేత్ర స్థాయిలో చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు. కొన్ని చోట్ల తేమ ఎక్కువగా ఉందని చెప్పి వ్యాపారులు, మిల్లర్లు ధరలో కోత పెడుతున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందనీ, అందువల్ల ధాన్యాన్ని మార్కెట్లకు తెచ్చే ముందు ఆరబెట్టాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. కళ్లాల నుంచి నేరుగా వడ్లను మార్కెట్లకు తరలించకుండా ఒకట్రెండు రోజులు ధాన్యాన్ని ఆరబెట్టి మంచి రేటు పొందాలని సూచించారు. ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు మార్కెట్ యార్డుల్లో తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు సీసీ కెమెరాలు అమర్చి వడ్ల దొంగతనం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు ఏరోజుకారోజు మార్కెట్లలో జరుగుతున్న కొనుగోళ్లపై మానిటరింగ్ చేయడంతో పాటు రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా కోసం ఉమ్మడి జిల్లాలకు నియమించిన సీనియర్ ఐఎఎస్ అధికారులే ధాన్యం కొనుగోళ్లను కూడా పర్యవేక్షించాలని ఆదేశించారు. వడగండ్ల వానలు వచ్చినా ఇబ్బంది లేకుండా అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కొన్ని చోట్ల రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు తప్పుడు ఫిర్యాదులు, మీడియాలో ఉద్దేశపూర్వక కథనాలు వస్తున్నాయని అధికారులను అప్రమత్తం చేశారు. అలాంటి చర్యలకు పాల్పడే వారిపై వెంటనే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని ఆదేశించారు.



రాష్ట్రంలో తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పెరుగుతున్న ఎండల దృష్ట్యా రాబోయే రెండు నెలలు మరింత కీలకమని అన్నారు. గతేడాదితో పోలిస్తే ఎక్కువ నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ ప్రజల అవసరాలకు సరిపోవడం లేదని గుర్తు చేశారు. భూగర్భ జల మట్టం పడిపోవటంతో ప్రజలు నల్లా నీటిపై ఆధారపడుతున్నారనీ, ఫలితంగా రాష్ట్రంలో నీటి సమస్య తలెత్తిందన్నారు.

తాగు నీటి కోసం వచ్చే ఫిర్యాదులను యుద్ధ ప్రాతిపదికన సమీక్షించి వెంటనే ఆయా ప్రాంతాలకు నీటి సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సారధ్యంలోఏ రోజుకారోజు మిషన్ భగీరథ, మున్సిపల్, ఇరిగేషన్, విద్యుత్తు శాఖ అధికారులు తాగునీటి సరఫరాపై సమీక్ష జరపాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే రోజుల్లో డిమాండ్ మరింత పెరిగినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులను అప్రమత్తం చేశారు. అవసరమైతే నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజీ నుంచి నగరానికి నీటిని తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే సింగూర్ నుంచి నీటి సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కృష్ణా బేసిన్‌లో నీటి లభ్యత లేనందున నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి తాగునీటిని తెచ్చుకునేలా కర్ణాటక ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లో ఇటీవల సిబ్బంది అత్యుత్సాహంతో ఒకచోట తాగునీటి సరఫరా నిలిచి పోయిందనే విషయం ఈ సందర్భంగా సిఎం దృష్టికి రావడంతో ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగా తాగునీటి సరఫరాకు ఆటంకం కల్పించిన వారిని వెంటనే ఉద్యోగాల నుంచి తొలగించాలని ఆదేశించారు. అకారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గాలి బీభత్సం.. భారీ వర్షం

- రోడ్డు పాలైన మక్కలు - ఆందోళనలో రైతులు
- పిడుగుపాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈదురు గాలులు, భారీ వర్షాలతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీభత్సం సృష్టించింది. అక్కడక్కడ కురిసిన వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చేతికొచ్చిన మొక్కజొన్న పంట నీళ్లపాలైంది. వరి, మామిడి రైతులు భారీగా నష్టపోయారు. తిమ్మాజీపేట మండలం నేరళ్లపల్లిలో కురిసిన భారీ వర్షానికి 100 క్వింటాళ్ల మక్కలు నీటిపాలయ్యాయి.



వర్షానికి తడిచిన మొక్కజొన్న

నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలో వివిధ గ్రామాల్లో కల్లాల్లో, రోడ్లపై ఆరబెట్టిన వరి, మొక్కజొన్న పంట తడిసి ముద్దయ్యాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి జరిగిన నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం అందించాలని సిపిఎం నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు డిమాండ్ చేశారు. పిడుగుపాటులో మరణించిన శ్యామలమ్మ కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం అందివ్వాలని కోరారు.

కొట్టుకుపోయిన మొక్కజొన్న : మారేపల్లి గ్రామానికి చెందిన మధుసూదన్ రెడ్డి పండించి 80 క్వింటాల మొక్కజొన్నను రెండు రోజులుగా మారేపల్లి - నేరాలపల్లి గ్రామాల మధ్యలో ఉన్న రహదారిపై ఆరబెట్టగా శుక్రవారం కురిసిన వర్షానికి మొత్తం కొట్టుకుపోయింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

పిడుగు పడి మహిళ మృతి : నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం తాడూర్ గ్రామానికి చెందిన మహిళా రైతు గుండమోని శ్యామలమ్మ (34) తన వ్యవసాయ పొలంలో సాయంకాలం పశువులకు నీరు తాపుతుండగా ఆమెకు సమీపంలో పిడుగుపడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఆమెకు భర్త పర్వతాలు, ముగ్గురు కుమారులు ఉన్నారు.

14న కరీంనగర్‌లో దీక్ష

- కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు ఆ రెండు పార్టీల కుట్ర
- మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు కుట్ర చేస్తున్నాయని బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఆ రెండు పార్టీల వైఫల్యాలకు నిరసనగా ఈనెల 14న కరీంనగర్‌లో దీక్ష చేయనున్నట్టు వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ఓట్లు అడిగేందుకు మోడీకి ఏం హక్కు ఉందని ప్రశ్నించారు. 'తెలంగాణకు బిజెపి చేసిందేంటి? కొత్త రాష్ట్రానికి పదేండ్లలో బిజెపి ఇచ్చిందేంటి? దేశాన్ని అదాని, అంబానీకి అమ్మడం తప్ప మోడీ ఏం చేశారు? బిజెపిని వ్యతిరేకిస్తే ఇడి, సిబిఐలతో ఇబ్బంది పెడుతున్నారు. రాముడి ఫొటో పక్కన మోడీ ఫొటో ఎలా పెడుతారు. అభివృద్ధి ఏం చేశారని అడిగితే అది పక్కన పెట్టి గాలి కబుర్లు చెబుతున్నారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సికింద్రాబాద్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. చేనేత కార్మికులకు బిజెపి అన్యాయం చేసిందని విమర్శించారు. ప్రకృతి వైపరీత్యాలకు నార్త్ ఇండియాలో ఎలా ఆదుకుంటున్నారో, సౌత్ ఇండియాలో కూడా అలాగే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మిషన్ కాకతీయ నీళ్లు ఎటు పోయాయని ప్రశ్నించారు. మేం తాగినమా,? మీరు తాగారా? అని బిఆర్ఎస్ నేతలనుద్దేశించి ఎద్దేవా చేశారు. గుర్తింపు కోసమే కొందరు బిజెపి నాయకులు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కరువుపై బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారు

- బిజెపి, బిఆర్ఎస్ నేతలపై కోదండరెడ్డి ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరువు పరిస్థితులపై బిజెపి, బిఆర్ఎస్ నేతలు బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని కిసాన్ కాంగ్రెస్ జాతీయ నేత కోదండరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో బిఆర్ఎస్ నేతలు అధికారంలో ఉండి కూడా అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. శుక్రవారం హైదరబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. దేశంలో అనేక సార్లు తీవ్రమైన కరువు వచ్చిందన్నారు. దాన్ని అధిగమించేందుకు ఆనాడు రాజశేఖర్ రెడ్డి కేంద్రానికి నివేదిక పంపించారని తెలిపారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కరువును అధిగమించేలా రాష్ట్రాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తాగు, సాగు నీరు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కోసం సిఎం రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారని పేర్కొన్నారు. కష్టకాలంలో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు కేంద్రాన్ని నిలదీయాలని కోరారు. కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పదేండ్ల బిజెపి పాలనలో దేశంలో పేదలు తీవ్ర ఇబ్బందులపాలయ్యాయరని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ఇప్పటి వరకు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని విమర్శించారు.

మాకు కేటాయించిన ఇళ్లు మాకే ఇవ్వాలి

- కెసిఆర్ వ్యవసాయ క్షేత్రం ముందు లబ్ధిదారుల నిరసన



కెసిఆర్ వ్యవసాయ క్షేత్రం వద్ద నిరసన తెలుపుతున్న డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను తమకే ఇవ్వాలని సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన లబ్దిదారులు మాజీ సిఎం కెసిఆర్ వ్యవసాయ క్షేత్రం ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గజ్వేల్ నియోజకవర్గంలో గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం 1250 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి, టోకెన్ల ద్వారా డ్రా తీసి లబ్దిదారులను ఎంపిక చేశారు. కాగా, ఈ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మల్లన్న సాగర్ నిర్వాసితులు నివాసం ఉంటున్నారు. టోకెన్ల ద్వారా ఎంపికైన లబ్దిదారులు.. తమ ఇంటిని ఖాళీ చేయాలని మల్లన్న సాగర్ నిర్వాసితులను అడగ్గా తమకు ఇంకా రావాల్సిన నష్ట పరిహారం వచ్చే వరకు తాము ఖాళీ చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. దాంతో చేసేదేమీ లేక గజ్వేల్ పట్టణానికి చెందిన సుమారు 50 మంది లబ్దిదారులు.. ఆటోల్లో మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని మాజీ సిఎం కెసిఆర్ వ్యవసాయ క్షేత్రానికి చేరుకుని గేటు ఎదుట నిరసన చేపట్టారు. లబ్దిదారులు రోడ్డుపై బైటాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో తమకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్వాసితులకు ఇవ్వడం దారుణమన్నారు. ఇప్పుడు భూ నిర్వాసితులు ఇండ్లు ఖాళీ చేయడం లేదని, తమకు కేటాయించిన ఇళ్లు వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న మర్కుక్ ఎస్ఐ చల్ల మధుకర్ రెడ్డి నిరసనకు దిగిన వారితో మాట్లాడి, సమస్యలుంటే కలెక్టరేట్‌కు వెళ్లాలని, మీలో లబ్దిదారులైన కొంతమంది పేర్లు ఇస్తే మాజీ సిఎం కెసిఆర్‌కు అందజేస్తామని తెలపగా, లబ్దిదారులు నిరసనను విరమించారు.

మార్గదర్శి మాకినేని బసవపున్నయ్య

- ఎన్నికల్లో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు
- హైదరాబాద్‌లో ఎంబి వర్ధంతి కార్యక్రమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మార్క్సిస్టు పార్టీ నేత మాకినేని బసవపున్నయ్య (ఎంబి) బహుముఖ ప్రజ్ఞాశాలి అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. పార్టీ ఎత్తుగడలను రూపొందించడంలో, సైద్ధాంతిక అవగాహనను పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషించారని చెప్పారు. ఎంబి 32వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో నిర్వహించారు. బసవపున్నయ్య చిత్రపటానికి రాఘవులు పూలమాలవేసి నివాళులర్పించారు. 'జోహార్ మాకినేని, సాధిస్తాం మాకినేని ఆశయాలను'అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ పార్టీ ఎత్తుగడలకు సంబంధించి ఆయన రచనలను అధ్యయనం చేయాలని సూచించారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ అనుసరిస్తున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం జరుగుతోందని, పార్లమెంటు ఎన్నికల్లోనూ దాన్ని కొనసాగించాలని చెప్పారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకికవాదం గురించి మౌలిక విషయాలను ఆయన రాశారని గుర్తు చేశారు. లౌకికవాదం, దాని స్వభావం గురించి సైద్ధాంతిక రూపకల్పన చేశారని వివరించారు. రాజీవ్‌గాంధీ బాబ్రీమసీదు తాళాలు తెరిపించి, హిందువులు పూజలు చేసుకోవడానికి అనుమతి ఇచ్చారని చెప్పారు. కాంగ్రెస్ లౌకికవాద పార్టీ అయినపుడు ఆ పనిచేయాల్సిన అవసరమేంటన్న ప్రశ్న అందరిలోనూ వచ్చిందన్నారు. ఆ అంశంపైనే మాకినేని ఓ వ్యాసం రాశారని అన్నారు. కాంగ్రెస్ లౌకికవాద అవగాహనలోనే ఒక లోపం ఉందన్నారు. లౌకికవాదాన్ని కమ్యూనిస్టులు చూసే పద్ధతి, బూర్జువాలు, కాంగ్రెస్ పార్టీ చూసే పద్ధతికి తేడా ఉందని చెప్పారు. అది జాతీయోద్యమం నుంచి ఉందన్నారు. అందుకే మతోన్మాదులపై పోరాటం సాగిస్తున్నామని చెప్పారు. ఇప్పుడు ఈ పోరాటానికి మాకినేని సైద్ధాంతిక ఆయుధాలనీ, వాటిలో ఎన్నో విషయాలు, సందర్భాలను ఆయన ప్రస్తావించారని వివరించారు. ఆయన్ను స్మరించుకుంటు న్నామంటే ఆచరణలో ఆయన ఆలోచనలు ఎప్పుడు ఏ రకంగా ఉపయోగపడతాయో వాటిని తెలుసుకోవాల్సిన అవసరముందని చెప్పారు. ఆ రకమైన ప్రయత్నం అందరూ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, డిజి నరసింహారావు, టి జ్యోతి, టి సాగర్, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డి, బొంతల చంద్రారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, జె బాబురావు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగుల వయోపరిమితి వార్తలు అవాస్తం

- రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యోగుల వయోపరిమితికి 61 ఏండ్లు లేదా 33 ఏండ్ల సర్వీసును ప్రాతిపదికగా తీసుకుంటారంటూ వివిధ పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ అంశంపై ప్రభుత్వ స్థాయిలో ఏ విధమైన ప్రతిపాదన కానీ, ఫైల్ నిర్వహణ కానీ లేదని స్పష్టం చేశారు. ఈ విధమైన ఊహాజనిత వార్తలు రాయడం సరైంది కాదని తెలిపారు. ఇలాంటి అవాస్తవ వార్తలను ప్రచురించే, ప్రచారం చేసే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకునే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని పేర్కొన్నారు.

ప్రభుత్వం స్పష్టతనివ్వాలి టిఎస్‌యుటిఎఫ్ : ఉద్యోగుల వయోపరిమితి వయస్సుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనివ్వాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ వార్తపై సాధారణ పరిపాలన శాఖ, ఆర్థిక శాఖ అధికారులను సంప్రదించగా తమకు తెలియదంటూ సమాధానమిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి గాలి వార్తలను ప్రచారంలో పెట్టి ఉద్యోగులను గందరగోళంలోకి నెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఎవరైనా ప్రయత్నిస్తున్నారేమోననే సందేహం కలుగుతున్నదని తెలిపారు. నిజంగానే అలాంటి ఆలోచన ప్రభుత్వానికి ఉంటే దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. సర్వీసును 33 ఏళ్లకు పరిమితం చేయడం సమంజసం కాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై వెంటనే వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తెలుగులో సాహిత్య విమర్శకు ప్రాధాన్యం ఇవ్వాలి



ప్రజాశక్తి - కల్చరల్

తెలుగులో సాహిత్య విమర్శ తక్కువగా వుందని దీనికి ప్రాధాన్యత ఇచ్చినప్పుడు ఉత్తమ రచనలు వెలువడతాయనీ రాష్ట్ర శాసన సభ తొలి సభా పతి సిరికొండ మధుసూదనాచారి అన్నారు. రమణ వెలమకని ఉత్తమ సాహితీ విమర్శకుడు అని పేర్కొన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో గాన సభ పూర్వ అధ్యక్షుడు కళా వెంకట దీక్షితులు జయంతి సందర్భంగా ఆయన పేరిట ఏర్పాటు చేసిన పురస్కారం సాహితీవేత్త విమర్శకుడు రమణ వెలమకనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి బహుకరించి మాట్లాడారు. దీక్షితులు తండ్రి కళా సుబ్బారావు నిర్వహణలో ఏర్పాటైన గాన సభ ప్రతిష్టను కొనసాగించటంలో విశేష కృషి చేశారని ప్రశంసించారు. సుదీర్ఘ కాలం అధ్యక్షునిగా దీక్షితులు ఇంటి పేరుకు తగ్గట్టుగానే కళా సేవ చేశారని ఎందరో ఔత్సాహిక కళా కారులు వేదిక ఇచ్చారని చెప్పారు గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ తన సోదరుడు దీక్షితులు మార్గంలో గాన సభ గౌరవం కాపాడుతున్నానని తెలిపారు రమణ వెలమకని సాహిత్య ప్రసంగాలు మంచి సమాచారంతో పరిశోధనాత్మకంగా వుంటాయని వివారించారు వేదిక పై కథక్ కళాకారుడు పండిట్ అంజి బాబు, శంకర్ ప్రసాద్‌లు పాల్గొని దీక్షితులుతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు

19 నుంచి 28 వరకు మోడల్ ఇఎపిసెట్

- 30న మోడల్ నీట్ పరీక్ష
- విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఈ నెల 19 నుంచి 28 వరకు మోడల్ ఇఎపిసెట్, ఈ నెల 30న మోడల్ నీట్ పరీక్షలు నిర్వహించనున్నట్టు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి, రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యాలయంలో మోడల్ పరీక్షలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఇఎపిసెట్‌ను ఆన్‌లైన్‌లో, నీట్‌ను ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తామనీ, ఎంట్రీ ఫీజు వంద రూపాయలని తెలిపారు. ప్రతిఏటా విద్యావేత్త చుక్కారామయ్య, సీనియర్ ప్రొఫెసర్ల సౌజన్యంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పరీక్షలపై సరైన అవగాహన లేక గ్రామీణ ప్రాంత విద్యార్థులు మార్కులు కోల్పోతున్నారనీ, విద్యార్థుల్లో పోటీ పరీక్షల భయం పోగొట్టేందుకు, మానసిక స్థైర్యం పెంచేందుకు ఈ మోడల్ సెట్‌లు దోహదపడుతున్నాయని చెప్పారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి బహుమతులను అందజేస్తామనీ, మరిన్ని వివరాల కోసం 94900 98292, 82476 72658 నెంబర్లను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు అచ్చిన లెనిన్, కార్యదర్శి ఎం. అశోక్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు జానుగరి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

భూస్వాముల చేతుల్లోనే నిర్వాసితుల భూములు

- ప్రభుత్వ భూములను పేదలకు లీజుకు ఇస్తున్న పెద్దలు
- ఉండేది హైదరాబాద్‌లో.. ఇక్కడ పేదల భూములపై కన్ను

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



40 ఏళ్ల క్రితం శ్రీశైలం ముంపులో భూములు కోల్పోయిన వారికి అప్పట్లో కొంతమేరకు పరిహారం ఇచ్చారు. ప్రాజెక్టు కోసం ప్రభుత్వం లక్షా 25 వేల ఎకరాలను రైతుల నుంచి సేకరించింది. ఇందులో సన్న, చిన్న, మధ్యతరగతి రైతులు అధికంగా ఉన్నారు. నష్టపోయినా సరే ప్రాజెక్టు కోసం తమ భూములను ప్రభుత్వానికి అప్పచెప్పి తమ సహృదయాన్ని చాటుకున్నారు. కాగా, ఎండకాలంలో రిజర్వాయరు ఖాళీ అయిన తర్వాత తేలిన భూములపై కొంతమంది కన్నుబడింది. హైదరాబాద్‌లో స్థిరపడిన పెద్దలు ప్రభుత్వ భూములను కబ్జా చేసుకొని పేదలకు కౌలుకు ఇచ్చి లక్షలు వసూలు చేస్తున్నారు. ఏక్ సాల్ పట్టా కింద శ్రీశైలం ముంపు భూములపై పేదలకు హక్కులు కల్పించాలని పలు పార్టీలు, ప్రజాసంఘాలు కోరుతున్నాయి.

1986కు ముందే శ్రీశైలం రిజర్వాయరు ఏర్పాటు కోసం లక్షా 25 వేల ఎకరాలను ప్రభుత్వం రైతుల నుండి సేకరించింది. 50 వేల కుటుంబాలు ఈ ప్రాంతం నుండి ఖాళీ చేసి హైదరాబాద్ వంటి నగరాలకు వలసపోయారు. ఈ రిజర్వాయరులో ఒక అలంపూర్‌లోనే 60 గ్రామాలు నీట మునిగాయి. కొల్లాపూర్, వనపర్తి, పెబ్బేర్ మండలాల పరిధిలో సుమారు 18 గ్రామాలు నీట మునగడంతో ఈ ప్రాంతం ప్రజలు ఇక్కడి నుండి వలసపోయారు. వీరు సాగు చేసుకుంటున్న భూములను అప్పటి ప్రభుత్వం లక్షా 25 వేల ఎకరాలను సేకరించి వారికి అరకొర పరిహారాన్ని అందించింది. శ్రీశైలం నిండుగా ఉన్నప్పుడు వీరి భూములు మునిగిపోతాయి. ఎండాకాలంలో అయితే రిజర్వాయరు ఖాళీ అయ్యి భూములు తేలతాయి. ఈ సమయంలో భూముల్లో వేరుశనగ, మక్క, ధనియాలు, కుసుమలు, ఆవాలతో పాటు కూరగాయలు కమర్షియల్ ఆరుతడి పంటలు సాగు చేసే అవకాశాలు ఉన్నాయి. ఇది గమనించిన ఇక్కడి భూములను వదలిపెట్టిన భూస్వాములు కొందరు.. హైదరాబాద్‌లో స్థిరపడిన వారు వచ్చి తేలిన భూములను కబ్జా చేసుకున్నారు. వీరికి సాగు భూములకు సంబంధం లేకున్నా.. కబ్జా చేసుకొన్నారు. కబ్జా చేసుకున్న భూములను ఈప్రాంతంలో ఉండే రైతులకు కౌలుకు ఇస్తున్నారు. కౌలుకు ఇవ్వడం ద్వారా రైతుల నుండి లక్షలు వసూలు చేస్తున్నారు. ఒక ఎకరాకు కౌలు రూ. లక్ష వరకు వసూలు చేయడం వల్ల కౌలు రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు.

లక్షా 25 వేల ఎకరాల్లో 25 వేల ఎకరాలు సాగుకు యోగ్యం కానివి గుట్టలు, కాల్వలు లాంటి భూములున్నాయి. ఇందులో 15 వేల ఎకరాలు ప్రభుత్వ భూములు కాగా, మిగతా భూములను రైతుల నుండి సేకరించారు. ఆయా భూములను ప్రభుత్వ రికార్డులోకి ఎక్కించారు. ధరణి ప్రకారం ఈ భూములను ఎవరూ.. పట్టాల మార్పిడి గాని, అక్రమంగా సాగు చేయడానికి గాని వీలుకాదు. అధికారులకు తెలియకుండానే కృష్ణా పరివాహక ప్రాంతంలో సాగు చేసుకుంటున్నారు. ఇందులో సుమారు 15 వేల మంది 50 వేల ఎకరాల్లో గతంలో పట్టాలు ఉన్నవారు ఉన్నారు. మిగితా భూములు ఇతరుల కబ్జాలో ఉన్నాయి. కొంత మంది హైదరాబాద్‌లో ఉండి ఇక్కడి భూములను కబ్జా చేసుకున్నారు. దాంతో సన్న, చిన్న కారు రైతులు కౌలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. నదీపరివాహక ప్రాంతంలో కౌలు తీసుకొని సాగుకు అప్పచెప్పడం వంటివి జరుగుతున్నా.. అధికారులకు తెలియకపోవడం విడ్డూరం. శ్రీశైలంతో పాటు అనేక రిజర్వాయర్లలో సైతం సాగు భూములు ముంపునకు గురయ్యాయి. పాలమూరు-రంగారెడ్డి కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టుల్లో సుమారు 50 వేల ఎకరాలకు పైగా సాగు భూములు మునిగిపోయాయి. కొన్ని రిజర్వాయర్లలో ఇంకా నీటిని నింప లేదు. ఇక్కడ సైతం రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారు. రిజర్వాయర్ల కోసం తవ్విన కాల్వలు, సర్వీసు రోడ్లను సైతం కొందరు అక్రమంగా కబ్జాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కలగచేసుకొని కబ్జాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, నిజమైన లబ్దిదారులకే సాగుకు అవకాశం ఇవ్వాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

మా భూములకే మేము కౌలు ఇచ్చుకునే పరిస్థితులు వచ్చాయి.
శ్రీశైలం, రైతు, సోమశీల, కొల్లాపూర్ మండలం

శ్రీశైలం రిజర్వాయరులో సర్వం కోల్పోయాం. ఇల్లు, భూములు నీట మునిగాయి. ఇక్కడి నుంచి తమను బలవంతంగా బయటకు పంపారు. అయితే వేసవిలో తేలిన భూములను కొంత మంది భూస్వాములు మాకు కౌలుకు ఇస్తున్నారు. మా భూములను సాగు చేసుకోవడానికి మాకే పట్టాలు ఇవ్వాలని కోరుతున్నాం.

పేదలకు పట్టాలు ఇవ్వాలి.
ఎండీ జబ్బార్, సిపిఎం జిల్లా కార్యదర్శి, వనపర్తి

శ్రీశైలం రిజర్వాయరులో అనేక మంది పేదల భూములు కోల్పోయారు. అయితే కొంత మంది భూస్వాములు మునిగిన భూములను నేటికీ కౌలుకు ఇవ్వడం విచిత్రంగా ఉంది. గతంలో మంత్రి జూపల్లి కృష్ణారావు ఎంగంపల్లి గ్రామానికి వచ్చి వాస్తవంగా పంటలు సాగు చేసుకుంటున్న వారికి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకొని ప్రతి రైతుకు పట్టాలు ఇవ్వాలి. లేనిచో రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదు.

దరఖాస్తులు వస్తే.. ప్రభుత్వానికి నివేదిస్తాం
హిమబిందు తహసీల్దార్, పెంట్లవెల్లి

కృష్ణానదిలో ముంపునకు గురైన ప్రతి ఎకరాకు పరిహారం ఇచ్చాం. ఇప్పుడు ధరణిలో భూమి వివరాలు నిక్షిప్తమై ఉన్నాయి. రైతులు ఎవరూ.. అక్కడ పంటలు వేసుకోరాదు. కొందరు వేసుకున్నా.. వర్షాలు వస్తే.. నీటిలో మునిగిపోతాయి. వారికి ఎటువంటి పరిహారం రాదు. అయితే ఏడాదిలో ఒకసారి పంట వేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని ఎవరైన కోరి దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వానికి నివేదిస్తాం. ఏదైనా కలెక్టర్ నిర్ణయం మేరకే జరగాల్సి ఉంది.

భువనగిరి కోటపై ఎర్ర జెండా ఎగరాలి

- భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు చేస్తున్న బిజెపి
- పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించండి : జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేస్తున్న బిజెపిని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని, పోరాటాల అడ్డా భువనగిరి కోటపై ఎర్ర జెండా ఎగురవేయాలంటే భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండి జహంగీర్‌ను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. శుక్రవారం నల్లగొండ జిల్లా గట్టుప్పల మండల కేంద్రంలో ఆ పార్టీ చండూరు, గట్టుపల మండలాల విస్తృత స్థాయి సమావేశాన్ని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చాపల మారయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. మునుగోడు నియోజకవర్గ వెనుకబాటుకు కారణం గత పాలకులేనని తెలిపారు. మూసీ నది ప్రక్షాళన చేయాలని పాదయాత్రలు చేయడంతో పాటు సాగు, తాగునీరు కోసం పోరాటాలు నిర్వహించడంలో కమ్యూనిస్టులు కీలకపాత్ర పోషించారన్నారు. మునుగోడు నియోజకవర్గంలో ఇళ్ల స్థలాల కోసం, కార్మికుల కోసం, గీత కార్మికుల సమస్యల కోసం, పేద ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాడింది కమ్యూనిస్టులేనని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచనలకు అడ్డుగా ఉన్న భారత రాజ్యాంగాన్ని సంపూర్ణంగా మార్చి, ఆ స్థానంలో మనుధర్మాన్ని తీసుకొచ్చి ఫ్యూడల్ పద్ధతులు ప్రవేశ పెట్టడం కోసం బిజెపి కృషి చేస్తోందని, దీని ద్వారా కుల, మత, ప్రాంత విద్వేషాలు సృష్టిస్తుందన్నారు. ఇప్పటికే సీఏఏ, పౌరసత్వరద్దు, జ్యోతిష్యశాస్త్ర అమలు, విద్యా కాషాయికరణతో చేయడంతో పాటు ఇడి, సిబిఐ లాంటి సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాలను బెదిరించడం, వారిని లొంగదీసుకోవడం, మేధావులను జైళ్లల్లో పెట్టడం లాంటి వాటిని బలవంతంగా అమలు చేస్తుందన్నారు. నోట్ల రద్దుతో నల్ల డబ్బును బయటికి తీసి దేశ ప్రజల ఖాతాల్లో ప్రతి ఒక్కరికి రూ.15 లక్షలు జమ చేస్తామని చెప్పిన బిజెపి.. అవినీతికి చట్టబద్ధత కలిగించిందన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో రూ.1600 కోట్ల అవినీతి జరిగితే, దాంట్లో రూ.800 కోట్లు బిజెపికి చేరాయని తెలిపారు. బాండ్స్ చట్ట విరుద్ధమైనవని సిపిఎం పోరాడటంతో.. సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడం వల్ల అవినీతి బయటికి వచ్చిందన్నారు. విద్యా రంగానికి బడ్జెట్ తగ్గించి (0.4శాతం) విద్యను పూర్తిగా ప్రయివేటీకరణ చేశారన్నారు. ఆకలి సూచిలో మనదేశం 111 స్థానంలో ఉందన్నారు. లిక్కర్ కేసులో బిజెపికి అరబిందో ఫార్మా కంపెనీ అధినేత శరత్ చంద్రారెడ్డి ద్వారా రూ.60 కోట్ల ముడుపులు ముట్టాయని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. మునుగోడు నియోజకవర్గ ప్రజలందరికీ సిపిఎం చేసిన పోరాటాలు తెలుసున్నారు. సిపిఎం పోరాటాల ఫలితంగా పేదలకు భూములు, ఇళ్ల స్థలాలు సాధించిపెట్టామన్నారు. మునుగోడు నియోజక వర్గంలో ప్రజల కోసం నిరంతరం పనిచేస్తామన్నారు. నిరంతరం నిజాయితీగా, నికరంగా, అవినీతికి తావులేకుండా ప్రజాసమస్యలపై పోరాడే భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా ఎండీ జహంగీర్‌ను ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం, జిల్లా కమిటీ సభ్యులు చాపల మారయ్య, చండూరు మండల కార్యదర్శి మొగుదాల వెంకటేశం, సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనుంజయ గౌడ్, గట్టుప్పల్ మండల కమిటీ సభ్యులు కర్నాటి సుధాకర్, అచ్చిన శ్రీనివాస్, పి శ్రీను, ఖమ్మం రాములు, పెద్దగాని నరసింహ, బి నరసింహ, బి యాదయ్య, విశ్వనాథం, అబ్బయ్య, ఈరటి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి


సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

రెండేళ్ల కాలపరిమితితో గుర్తింపు పత్రం ఇవ్వాలి

- ఎస్‌సిఇయు రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెండు సంవత్సరాల కాల పరిమితితో గుర్తింపు పత్రం ఇవ్వాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎస్‌సిఇయు (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. సింగరేణి ఆర్జీ-1 జిడికె 2వ ఇంక్లైన్‌లో నూతన ఫిట్ కమిటీ పరిచయ కార్యక్రమ సమావేశాన్ని ఆర్జీ-1 ఉపాధ్యక్షులు ఆసరి మహేష్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ.. సింగరేణిలో గుర్తింపు సంఘాల ఎన్నికలు జరిగి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు గుర్తింపు పత్రం ఇవ్వకపోవడం కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా పక్కదారి పట్టించడమేనని అన్నారు. గుర్తింపు పత్రం ఇవ్వకపోయినప్పటికీ గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఎర్రజెండానే కార్మికుల సమస్యల పరిష్కారానికి మార్గమని నమ్మిన కార్మికులు ఎఐటియుసి గుర్తింపు సంఘంగా గెలిపిస్తే.. గుర్తింపు పత్రం తీసుకోకపోవడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. గత ప్రభుత్వంతో సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని, అనేక రకాలుగా విమర్శలు చేసిన మీరు ఈ రోజూ అదే పరిస్థితి ఉన్నా ప్రశ్నించకపోవడం కార్మికుల హక్కులను తాకట్టు పెట్టడటమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి ప్రభుత్వంతో పోరాడేందుకు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్జీ-1 కార్యదర్శి మెండే శ్రీనివాస్, ఆరేపల్లి రాజమౌళి, ఆసరి మహేష్, కారం సత్తయ్య, పి శ్రీనివాసరావు, వంగల రాములు, ఎ శంకరన్న, పి సమ్మయ్య, కె కుమార్, భీమానాయక్, జనార్ధన్, టి శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.

అంబేద్కర్, ఫూలే స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- మనువాదాన్ని ఓడిద్దాం.. రాజ్యాంగాన్ని గెలిపిద్దాం..
- సిఐటియు ఆధ్వర్యంలో సహపంక్తి భోజనాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహనీయులు.. ఏప్రిల్ 6న కార్మికోద్యమ నేత బిటి రణదివే జయంతి, ఏప్రిల్ 11న సామాజికవేత్త మహాత్మా జ్యోతిబాపూలే జయంతితో పాటు ఏప్రిల్ 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని.. ఏప్రిల్ ఆరు నుంచి 14వ తేదీ వరకు సిఐటియు ఆధ్వర్యంలో సామాజిక న్యాయ వారోత్సవాలు నిర్వహిస్తున్న విషయం విధితమే. అందులో భాగంగా శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో కులాల మతాలకతీతంగా సహపంక్తి భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.జయరాజు, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.మాణిక్యం పాల్గొని మాట్లాడారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న కుల వివక్షతను అంతం చేయకుండా సామాజిక న్యాయం సాధ్యం కాదన్నారు. పాలకుల విధానాలు కుల వివక్షతను పెంచే విధంగా ఉన్నాయని తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న మనువాద విధానాలతో కార్మిక వర్గానికి తీవ్రం నష్టం వాటిల్లుతున్నదని, వారి ఐక్యతను దెబ్బతీస్తున్నదని ఆరోపించారు. నేటికీ కులం పేరుతో అవమానాలు, దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగంపై మనువాదులు దాడి చేస్తున్నారన్నారు. మనువాదాన్ని ఓడించి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కార్మిక వర్గ హక్కుల కోసం పోరాటం చేస్తూనే సమాజంలో నెలకొన్న దుర్మార్గమైన కుల వివక్షతను అంతమందించేందుకు సిఐటియు కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ భారత దేశంలో మాత్రమే ఉన్నదన్నారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం యాదగిరి మాట్లాడుతూ శ్రమ దోపిడితోపాటు సామాజిక దోపిడి కూడా కొనసాగుతోందన్నారు. మహనీయులు అంబేద్కర్, ఫూలే, బిటి రణదివేల స్ఫూర్తితో కుల వివక్షతను కూకటి వేళ్ళతో పెకిలించాలన్నారు. కార్మిక వర్గం ఐక్యం చేస్తూ కార్మికుల హక్కుల కోసం పోరాడుతునే సమాజంలో నెలకొన్న కుల వివక్షతను అంతం చేయడంలో భాగంగానే సహపంక్తి భోజనాలను ప్రతియేడు మహనీయుల మాసంలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సువర్ణ, రాజు, యాదగిరి, నర్సింలు, సుగుణ, నరసమ్మ, యాదయ్య, దత్తు, శోభ, రాజేష్, లక్ష్మణ్ మల్లేశం, రాజేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సహపంక్తి భోజన నిర్వహిస్తున్న దృశ్యం

నకిలీ నోట్లను చెలామణి చేస్తున్న ముఠా అరెస్ట్

- రూ.7 లక్షలు విలువ చేసే నకిలీ రూ.500 నోట్లు స్వాధీనం
- రాజేంద్రనగర్ పరిధిలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మార్కెట్‌లో నకిలీ రూ. 500 నోట్లు చలామణి చేస్తున్న ఇద్దరు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా పుంగనూరు చెందిన గంగరాజు స్టాక్ బ్రోకరేజ్ బిజినెస్ చేస్తూ పెద్ద ఎత్తున డబ్బు పోగొట్టుకున్నాడు. దాంతో సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. రెండు నెలల క్రితం మహారాష్ట్రకు చెందిన సచివ్ పవార్, సురేష్ పవార్ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన నకిలీ కరెన్సీ వీడియోను చూసి, వారిని సంప్రదించి వీడియో కాల్స్ ద్వారా నిర్ధారించుకున్నారు. వారు నకిలీ 500 రూపాయల నోట్లను 1:5 నిష్పత్తిలో సరఫరా చేస్తారు. కొద్ది రోజుల క్రితం వీరిద్దరూ మహారాష్ట్రలోని నందుర్‌బార్‌లోని ఛద్వేల్‌కు వెళ్లి సచివ్ పవార్, సురేష్ పవార్‌లను కలుసుకుని మార్కెట్‌లో పరీక్షించడానికి నమూనాగా పది నకిలీ నోట్లను కొనుగోలు చేసి సికింద్రాబాద్‌కు చేరుకున్నారు. ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన లక్కీ అనే వ్యక్తికి ఐదు నోట్లు ఇచ్చి మార్కెట్‌లో మార్పిడి చేయించి, సులభంగానే మారుతున్నాయని గ్రహించాడు. గంగరాజు రూ.3.5 లక్షలు పోగు చేసుకుని ఇద్దరూ బెంగుళూరు, సూరత్, నందుర్ బార్ మీదుగా మహారాష్ట్రలోని ఛద్వేల్ పట్టణానికి చేరుకుని సచివ్ పవార్, సురేష్ పవార్‌లను కలిసి రూ.17 లక్షల నకిలీ నోట్లను తీసుకుని 3.5 లక్షలు (1:5 నిష్పత్తి) చెల్లించాడు. గంగరాజు పోలీసుల చేకింగ్స్ ఎక్కువగా ఉన్నాయనే భయంతో అక్కడే కొన్ని నకిలీ నోట్లు పారవేసి, బెంగుళూరుకు వెళ్లి తమిళనాడులోని తిరువూరుకు చెందిన రవి అనే వ్యాపారికి నకిలీ నోట్లు ఇవ్వడానికి ప్రయత్నించారు. కానీ ఒప్పందం కుదరలేదు. అక్కడి నుంచి హైదరాబాద్ చేరుకుని సికింద్రాబాద్‌లోని లాడ్జిలో బస చేశారు. మల్కాజిగిరిలోని సాయిరాం థియేటర్ సమీపంలోని నరేష్ అని వ్యక్తి సహాయంతో బైక్ అద్దెకు తీసుకున్నాడు. గంగరాజు అతని గ్రామానికి చెందిన అభినందన్‌ను తీసుకొని బైక్‌పై నకిలీ నోట్లను విక్రయించేందుకు మైలార్‌దేవ్‌పల్లి పీఎస్ పరిధిలోని మెహఫిల్ రెస్టారెంట్‌కు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఓటీ పోలీసులు, మైలార్‌దేవ్‌పల్లి పోలీసు బృందం వారిని పట్టుకుంది. వారి నుంచి రూ.6.65లక్షల విలువైన నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ 500 రూపాయల నోటుపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ఉండాల్సిన చోట చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ముద్రించారు. ప్రజలు తీసుకునే సమయంలో ఈ మార్పును గమనించాలని పోలీసులు సూచించారు. ఈ మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


రాజేష్ భార్య లావణ్యకు నగదును అందజేస్తున్న కె శ్రీనివాస్ రెడ్డి

జర్నలిస్టుల జీవితాలు ఆందోళనకరం

- యువ ఫొటో జర్నలిస్టు నర్రె రాజేష్ సంస్మరణ సభలో కె శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వృత్తిలో సవాళ్లు, విపరీతమైన పని ఒత్తిడి, సమయ పరిమితులు, తక్కువ వేతనాలతో జర్నలిస్టుల జీవితాలు ఆందోళనకరంగా మారుతున్నాయని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. యువ ఫోటో జర్నలిస్టు నర్రె రాజేష్ (41) ఇటీవల గుండెపోటుతో మరణించడం దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షులు అనుమళ్ల గంగాధర్ అధ్యక్షతన శుక్రవారం నర్రె రాజేష్ సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పత్రికల్లో వార్తలకు సాక్ష్యంగా నిలిచేది ఫొటోలేనని, ఆందోళనలు, హింసాత్మక సంఘటనలు తమ కెమెరాల్లో బంధించడానికి ఫొటో, వీడియో జర్నలిస్టులు పడే తిప్పలు వర్ణనాతీతమన్నారు. నర్రె రాజేష్ ఎంతో బాధ్యతగా తన కర్తవ్యాన్ని నిర్వర్తించారని కొనియాడారు. మీడియాకు ఫొటో జర్నలిస్టులు కళ్లు, చెవుల లాంటి వారన్నారు. రాజేష్ భార్యకు పెన్షన్‌తో పాటు ఆయన పిల్లలకు విద్యనందించడానికి మీడియా అకాడమీ సహాయం అందజేస్తుందన్నారు. రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి కె విరాహత్ అలీ మాట్లాడుతూ.. ఎప్పుడూ చిరునవ్వుతో పలకరించే రాజేష్ ఆకస్మిక మృతి తమను ఎంతో కలచివేసిందని, అతని కుటుంబానికి చేయూతనిస్తామని పేర్కొన్నారు. హెచ్‌యూజే అధ్యక్షులు శిగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ నర్రె రాజేష్ మృతితో తమ సంఘం క్రియాశీలక సభ్యుడిని కోల్పోయిందన్నారు. నర్రె రాజేష్ భార్య లావణ్యకు లక్ష రూపాయల నగదు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి కెఎన్ హరి, జెఎన్‌జెహెచ్‌ఎస్ అధ్యక్షులు బొమ్మగాని కిరణ్ కుమార్, అనిల్, అధిక సంఖ్యలో ఫొటో జర్నలిస్టులు పాల్గొన్నారు.

బిజెపి కుప్పకూలడం ఖాయం

- మైనార్టీల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యం : మంత్రి కొండా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి కుప్పకూలిపోవడం ఖాయమని, దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని శోభా గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. దేశవ్యాప్తంగా బిజెపి పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ఈ ఎన్నికల్లో బిజెపి ప్రజలు తగిన బుద్ధి చెప్పి ఇంటికి పంపిస్తారని అన్నారు. మోడీ పదేళ్ల పాలనలో నిరుద్యోగం, దారిద్ర్యం, ధరలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. పేదలపై భారాలు మోపి కార్పొరేట్లకు లాభాలు చేకూర్చడం తప్ప బిజెపి పాలనలో చేసిందేమీలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్ పార్టీ పని అయిపోయిందని, కెసిఆర్ ఫామ్‌హౌస్‌కు పరిమితమయ్యారని అన్నారు. రాష్ట్రంలో 14 పార్లమెంట్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలిపించుకుంటుందని స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని, కెసిఆర్‌కు వచ్చిన మెజార్టీ కన్నా ఒక్క ఓటు తనకు ఎక్కువ ఇవ్వాలని కోరారు. తాను గెలిస్తే గజ్వేల్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెడతానని చెప్పారు. జిల్లా మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్యేలు నర్సారెడ్డి, మైనంపల్లి హనుమంతరావు కొండంత అండగా ఉన్నారని అన్నారు. బిఆర్‌ఎస్ పార్లమెంటు అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మల్లన్న సాగర్, కొండపోచమ్మ జలాశయంలో ఇక్కడ ప్రాంత ప్రజలను ముంచిన వ్యక్తి అని అన్నారు. మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ సిద్దిపేట, గజ్వేల్ తనకు రెండు కళ్లులాంటివని, ఈ రెండు నియోజకవర్గాల్లో పార్లమెంట్ ఎన్నికల తర్వాత విస్తృతంగా పర్యటించి కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. నర్సారెడ్డి, తాను గజ్వేల్ నియోజకవర్గంలో ప్రత్యేక ట్రస్టు ద్వారా పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో మెదక్ పార్లమెంటు ఇన్‌చార్జి ప్రమోద్ కుమార్, దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నాయిని యాదగిరి, సర్దార్ ఖాన్, నరేందర్ రెడ్డి, నక్క రాములు గౌడ్, సురేష్, అజ్గర్ పాల్గొన్నారు.

డెడ్ స్టోరేజీకి చేరువలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు

- ప్రస్తుతం జలాశయం నీటిమట్టం 510.30 అడుగులు
- ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు పొంచి ఉన్న ముప్పు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెండు తెలుగు రాష్ట్రాల్లోని వేలాది గ్రామాలకు సాగు, తాగునీటిని అందిస్తున్న నాగార్జున సాగర్ జలాశయం ప్రమాదకర స్థితికి చేరింది. గతేడాది అనుకున్న స్థాయిలో కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడంతో నాగార్జునసాగర్ జలాశయం కనిష్ట నీటిమట్టానికి చేరువలో ఉంది. ఆయకట్టు కింద ఖరీఫ్, రబీ సీజన్‌లో ప్రభుత్వం క్రాఫ్ హాలిడే ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు వేసవి కాలం కావడంతో కృష్ణా జలాలపై ఆధారపడిన హైదరాబాద్ జంట నగరాలు, ఖమ్మం, ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లో మంచినీటి ఎద్దడి తీవ్రమవుతుండటంతో ప్రభుత్వం, ప్రాజెక్టు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ నెల 1వ తేదీ నుండి వారం రోజుల పాటు తాగునీటి అవసరాల కోసం ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. మరోవైపు ఒప్పందం ప్రకారం ఆంధ్ర రాష్ట్రానికి తాగునీటి అవసరాలకు ఐదు టిఎంసిల నీటిని కుడి కాలువ ద్వారా విడుదల చేస్తున్నారు. భవిష్యత్ అవసరాలకు శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నీటిని తీసుకునే అవకాశం కూడా లేదు. ఇప్పటికే శ్రీశైలం అడుగంటి పోయింది. ఈ లోపల వర్షాలు పడకుంటే రాబోవు మూడు నెలల పాటు తాగునీటి అవసరాలు ఎలా తీర్చుకోవాలని దానిపై అధికారులు తలలు పట్టుకుంటున్నారు.



హైదరాబాద్ తాగునీటి సరఫరాపై తీవ్రప్రభావం

నాగార్జునసాగర్ జలాశయం శుక్రవారం సాయంత్రానికి కనిష్ట నీటిమట్టానికి చేరువలో ఉంది. సాగర్ జలాశయం గరిష్ట నీటిమట్టం 590.5050 అడుగులు కాగా కనిష్ట నీటిమట్టం 510 అడుగులు. ప్రస్తుతం జలాశయం నీటిమట్టం 510.30 అడుగులుగా ఉంది. దీంతో హైదరాబాద్‌కు తాగు నీటి విడుదలకు ఇబ్బందిగా మారనుంది. సాగర్‌లో 510 అడుగుల నీటిమట్టం ఉంటేనే ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోతల ద్వారా హైదరాబాద్‌కు తాగునీటిని అందించడం వీలవుతుంది. తగ్గితే మాత్రం అక్కడి పంపులు నడపడం సాధ్యం కాదు. రెండు తెలుగు రాష్ట్రాల నీటి అవసరాలకుగాను 505 అడుగుల వరకు నీటిని వినియోగించుకునేందుకు ఒప్పందం జరిగింది. ఈ నేపథ్యంలో 510 అడుగుల కంటే నీటిమట్టం తగ్గితే అది హైదరాబాద్ తాగునీటి సరఫరాపై తీవ్రప్రభావం చూపుతుంది.

బ్లాక్‌మెయిల్‌తో రేవంత్ కొత్త నాటకం

- ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజలను ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేస్తూ రేవంత్‌రెడ్డి కొత్త నాటకానికి తెరలేపారని బిజెపి ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. రాష్ట్రంలో బిజెపి అభ్యర్థులను మార్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అంతకు ముందు ఒబిసి మోర్చా సమావేశంలో పాల్గొన్నారు. ఆయన సమక్షంలో బిఆర్‌ఎస్ నాయకులు బిజెపిలో చేరారు.

లష్కర్‌లో జోరుగా కాంగ్రెస్ ప్రచారం

- సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం
- మతతత్వ బిజెపికి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలి : విహెచ్
- ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తి దానం : డిసిసి అధ్యక్షులు రోహిన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా పనిచేసి పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో తనను గెలిపించి లష్కర్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట నియోజకవర్గ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని చే నెంబర్ చౌరస్తాలోని మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రోహిన్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. బిజెపి మత రాజకీయాలు చేస్తున్నదని, ఆ పార్టీ అభ్యర్థి కిషన్ రెడ్డికి పార్లమెంట్ ఎన్నికల్లో కనీసం డిపాజిట్ కూడా దక్కదని అన్నారు. కేంద్ర మంత్రిగా అంబర్‌పేట నియోజకవర్గానికి ఒక పైసా కూడా ఖర్చు చేయలేదని తెలిపారు. ఐదు సంవత్సరాలు గడిచిపోయినా అంబర్‌పేట ఫ్లైఓవర్ పనులు పూర్తి కాకపోవడం సిగ్గుచేటన్నారు. గతంలో కొన్ని పరిస్థితుల వల్ల తాను పార్టీ మారానని.. మళ్లీ సొంత గూటికి తిరిగి రావడంతో పక్షికి రెక్కలు వచ్చిన విధంగా ఉందన్నారు. ప్రతి కార్యకర్త ప్రతి రోజూ 50 మంది ఓటర్లను కలిసి కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను వివరించి వారిని చైతన్యం చేయాలని తెలిపారు. బిఆర్‌ఎస్ తనపై కోర్టులో కేసు వేసిందని, దానికి సమయం వచ్చినప్పుడు కోర్టులోనే సమాధానం చెప్తానని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు సరైన సమయంలో అవకాశాలు కల్పిస్తామన్నారు.

పిసిసి మాజీ అధ్యక్షులు వి. హనుమంతరావు మాట్లాడుతూ.. బిఆర్‌ఎస్ అవినీతి ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తే నిజమైన కాంగ్రెస్ వారికి అన్యాయం జరుగుతుందన్నారు. బిఆర్‌ఎస్ పాలనలో అన్ని శాఖల్లో అవినీతి జరిగిందని ఆరోపించారు. నయీం ఆస్తుల విషయంలో పోలీసులతో బీఆర్‌ఎస్ కుమ్మక్కై కొట్టేసిందని, వాటిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మతతత్వ బిజెపికి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని, దానం నాగేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. డాక్టర్ రోహిన్ రెడ్డి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడానికి తెలంగాణ నుంచి కనీసం 14 సీట్లు గెలవాలన్నారు. ఐదేళ్లు కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి.. బిజెపి కార్యకర్తలకూ సహాయం చేయని దౌర్భాగ్యస్థితిలో ఉన్నారని విమర్శించారు. బిఆర్‌ఎస్ త్వరలోనే ఖాళీ అవుతుందని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తి దానం నాగేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, డిసిసి మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ, మాజీ కార్పొరేటర్లు దిద్ది రాంబాబు, గరిగంటి శ్రీదేవి రమేష్, పులి జగన్, జ్ఞానేశ్వర్ గౌడ్, నారాయణస్వామి, సీనియర్ నాయకులు తోలుపునూరి కృష్ణ గౌడ్, లక్ష్మణ్, శంభుల శ్రీకాంత్ గౌడ్, లక్ పతి యాదగిరి గౌడ్, పోలినేని రామ్మోహన్ రావు తదితర నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

ధరలు పెంచినందుకు బిజెపోళ్లకు ఓట్లేయాల్నా?

- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వనందుకా?
- ఫూలే, అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తుంది కెసిఆర్ మాత్రమే
- పార్లమెంట్ ఎన్నికల తర్వాత అన్ని పథకాలకు మంగళం పాడనున్న రాష్ట్ర సర్కార్ : కెటిఆర్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

'రాముడితో మనకు పంచాయితీ లేదు.. ఎందుకంటే రాముడు అందరివాడు.. బిజెపి వ్యక్తి కాదు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని మాత్రం పండబెట్టి తొక్కుదాం.. ఓడిద్దాం' అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. తెలంగాణకు బిజెపి ఏం చేసిందో చెప్పి ఓట్లు అడగాలన్నారు. పదేళ్లలో అన్నీ ధరలు పెంచినందుకు బిజెపోళ్లకు ఓట్లేయాల్నా అని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయో హోదా ఇవ్వనందుకు వేయాల్నా అని నిలదీశారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన భువనగిరి పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశానికి కెటిఆర్ హాజరై మాట్లాడారు. రాముడిని అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తామంటే వారి నిజస్వరూపం బయటపెడతామని తెలిపారు. ఎంతో అద్భుతంగా నిర్మించిన యాదాద్రిని అడ్డం పెట్టుకుని రాజకీయం చేయలేదన్నారు. కేంద్రంలో ఏ పార్టీకి మెజార్టీ వచ్చే పరిస్థితి లేదని, ప్రజల ఆశీర్వాదంతో 12 సీట్లు వస్తే బిఆర్‌ఎస్సే చక్రం తిప్పే పరిస్థితి రావొచ్చన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను ఆచరణలో చేసి చూపెడుతోంది కెసిఆర్ మాత్రమేనని తెలిపారు. 17 పార్లమెంట్ స్థానాల్లో ఐదు సీట్లు ఎస్‌సి, ఎస్‌టిలకు కేటాయించగా, మిగతా 12 సీట్లలో 6 సీట్లు బిసిలకు కేటాయించామన్నారు. అది కేసీఆర్ వల్లనే సాధ్యమైందన్నారు. పూలే, అంబేద్కర్‌కు దండేసి దండం పెట్టుడు వేరని, వారి ఆశయాలను కొనసాగించే విధంగా చేతల్లో చేసి చూపించిన ఒకే ఒక్క నాయకుడు కెసిఆర్ అని కెటిఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి మైక్ వీరుడంటూ కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మైక్ పట్టుకుంటే ఆయనకు పూనకం వచ్చి.. ఏది పడితే అది మాట్లాడుతాడని తెలిపారు. ఇప్పుడిప్పుడే ప్రజలకు వాస్తవాలు తెలుస్తున్నాయన్నారు. రియల్ ఎస్టేట్ అంటే రేవంత్‌రెడ్డి.. రేవంత్‌రెడ్డి అంటే రియల్ ఎస్టేట్ అన్నాడని, ఇవాళ రియల్ ఎస్టేట్ పరిస్థితి ఏమైందని ప్రశ్నించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కెటిఆర్

ఎన్నికల తర్వాత అన్ని పథకాలకు మంగళం..

పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని పథకాలకు రేవంత్‌రెడ్డి మంగళం పాడుతారని కెటిఆర్ తెలిపారు. వంద రోజుల పాలనతో ఫ్రీ బస్సు ఒక్కటే స్టార్ట్ చేసింరని, ఈ పథకం వల్ల ఆర్‌టిసికి రూ. 1400 కోట్ల నష్టం వచ్చిందన్నారు. తులం బంగారం అనగానే మహిళలు సెంటిమెంట్‌కు పడిపోయి ఓట్లు వేశారని, కానీ తులం బంగారం ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎంపి అభ్యర్థి క్యామ మల్లేష్, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, జడ్‌పిటిసి చిన్నోళ్ల జంగమ్మ, మండల, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.